నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, ఆదివారం 22 డిసెంబర్ 2024 HYDERABAD



శనివారం గోల్కొండ క్రాస్ రోడ్‌లో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రాత పరీక్ష లేకుండానే రెగ్యులర్ చేయాలంటూ.. నిరసన తెలుపుతున్న తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ సభ్యులు



శనివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తున్న తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు



అపర్ణ, గ్రీన్‌మార్క్ సంస్థలు తమ భూములను లాక్కున్నాయని ఆరోపిస్తూ..శనివారం ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ భూ పత్రాలను ప్రదర్శిస్తున్న గిరిజనులు

# మా భూములు లాక్కొని.. మాపైనే దౌర్జన్యం

గిరిజన రైతుల ఆరోపణ



## ప్రభుత్వం న్యాయం చేయాలంటూ డిమాండ్

ఖైరతాబాద్, డిసెంబర్ 21 : ఏండ్ల తరబడి సాగు చేసుకుంటూ.. దానిపైనే తమ కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, రియల్ ఎస్టేట్ కంపెనీలు వచ్చి తమ భూములను గుంజుకొని తమపైనే దౌర్జన్యాలు చేస్తున్నాయని కొండకల్, వెలమల గ్రామాల గిరిజన రైతులు ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రాంబాల్ నాయక్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరాంనాయక్‌తో కలిసి గిరిజన రైతులు మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలో సర్వే నంబర్లు 362, 363, 364, 377లలో సుమారు 80 ఎకరాలతో పాటు మరో సర్వే నంబర్‌లోని 217 ఎకరాల మిర్సాబ్‌కుంట, వల్లభస్వామి కుంట, పీటీ తదితర భూములను గత దశాబ్దాల కాలంగా గిరిజన రైతులు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం వెలమల గ్రామంలోని వివిధ సర్వే నంబర్లలో ఉన్న సుమారు 160 ఎకరాలను 120 కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయని చెప్పారు. ఈ రెండు గ్రామాల మధ్య సుమారు 73 ఎకరాల బీళా దాఖల భూమి సైతం ఉన్నదని, అపర్ణ, గ్రీన్ మార్క్ నిర్మాణ సంస్థలు ఆయా భూములను ఆక్రమించుకొని దౌర్జన్యం చేస్తున్నాయని గిరిజన రైతులు ఆరోపించారు.

### దౌర్జన్యాలు చేస్తున్నారంటూ..

కొండకల్‌లోని 217 ఎకరాలను సీలింగ్ చట్టంలో భాగంగా 1973 ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదన్నారు. ఈ భూమిని సైతం గత యజమాని వ్యవసాయ యోగ్యం కాని భూమిగా తప్పుడు పత్రాలు సృష్టించి.. తన ఆధీనంలో ఉన్నట్లు చెబుతూ సదరు రెండు నిర్మాణ సంస్థలకు తమకు తెలియకుండానే విక్రయించాడన్నారు. ప్రస్తుతం గిరిజనులు వ్యవసాయ చేసుకుంటున్న భూములకు సంబంధించిన పట్టాలు, ఇతర పత్రాలు ఉన్నాయని, కానీ ఆయా నిర్మాణ సంస్థల యజమానులు బలవంతంగా తమ భూములను స్వాధీనం చేసుకొని తమపైనే దౌర్జన్యాలు చేస్తున్నారని గిరిజన రైతులు ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గిరిజన రైతులు జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించగా, వెంటనే విచారణ చేపట్టాలని రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించిందన్నారు. ప్రభుత్వం స్పందించి తమ భూములు తమకే దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, చందర్ నాయక్, శంకర్ నాయక్, రవి నాయక్, రాజు, లక్ష్మణ్ నాయక్, సేవ్యా నాయక్, కీర్యా నాయక్, లక్ష్మి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి నిధుల్లేవ్..!

నిలిచిపోతున్న పనులు..

మేడ్చల్: మున్సిపాలిటీల్లో నిధులు లేక అభివృద్ధి పనులు నిలిచి పోతున్నాయి. దీంతో అధికారులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పన్నుల వసూళ్లను రాబట్టే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే మార్చి నాటికి 2024-25 వ ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో పన్నుల లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అభివృద్ధి కుంటుపడవద్దంటే వసూళ్లు జరిగితేనే కొంత అయినా అభివృద్ధి పనులు జరిగే అవకాశం ఉంటుందని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు.

### రూ.184 కోట్ల బకాయిలు..

జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, 34 గ్రామ పంచాయతీల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ. 184 కోట్ల పన్ను వసూళ్లు చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు 52 శాతం మాత్రమే పన్నులు వసూళ్లు జరిగాయి. మున్సిపాలిటీల్లో రూ. 172 కోట్లు, గ్రామ పంచాయతీల్లో రూ. 10, 56 కోట్ల పన్నులను రాబట్టాల్సి ఉంది.

మున్సిపాలిటీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయపోగా, మేడ్చల్ జిల్లాలో ఇటీవలే 28 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసిన నేపథ్యంలో మున్సిపాలిటీలకు మరింత భారం పెరిగినట్లయింది. మున్సిపాలిటీలు నిధుల లేమితో ఇబ్బందులు పడుతుంటే..మరోవైపు విలీనం చేసిన గ్రామాలతో మున్సిపాలిటీ అధికారులు పెద్ద తలనొప్పిగా మారింది. మున్సిపాలిటీల్లో విలీనం చేసిన క్రమంలో గ్రామాలకు చెందిన ప్రజలు విలీనం చేయవద్దని ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో విలీనమైన గ్రామాల ప్రజలు తమ ప్రాంతాల్లో అభివృద్ధి జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# నందినగర్ గడ్డ.. కబ్జాలకు అడ్డా

ఏడాది కిందట విశాల మైదానం



## నేడు ఇరుకుదారితో బస్సులు బంద్

### రూ.150కోట్ల విలువైన స్థలంలో ఆక్రమణలు

### అధికార పార్టీ నేతల అండతో సర్కారు స్థలం మాయం

బంజారాహిల్స్, డిసెంబర్ 21 : హైదరాబాద్ నడిబొడ్డున బంజారాల ఆత్మగౌరవాన్ని ప్రతీకగా చెప్పుకునే నందినగర్ మైదానం ఏడాది కాంగ్రెస్ పాలనలో కనిపించకుండా పోయింది. వేలాదిమంది ప్రయాణికులకు అడ్డాగా ఏడాది కిందట ఉన్న నందినగర్ గడ్డ నేడు ఆక్రమణలకు అడ్డాగా మారింది. అధికార పార్టీ నేతల ధనదాహానికి నందినగర్ మైదానం మొత్తం ఇరుకుగా మారడంతో కనీసం ఆర్టీసీ బస్సులు సైతం నిలిపివేశారు. సుమారు ఎకరన్నర స్థలంలో అత్యధిక భాగంలో తాత్కాలిక షెడ్లు, డబ్బాలు, బిల్డింగ్ మెటీరియల్ వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని కొంతమంది అధికార పార్టీ నేతలు అద్దెలు వసూలు చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా.. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన రెవెన్యూశాఖ అధికారులు కానీ, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కానీ నోరుమెదపకపోవడం గమనార్హం. సుమారు రూ.150 కోట్ల విలువైన స్థలంలో ఆక్రమణలు జరుగుతున్నా.. పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఏడాదికాలంలో ఎకరం స్థలం కబ్జా..

షేక్‌పేట మండల పరిధిలోని సర్వే నంబర్. 403లోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని నందినగర్‌లో సుమారు రెండు ఎకరాల ఖాళీ ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలానికి ఒక వైపున ఆంజనేయస్వామి ఆలయం ఉండగా, మిగిలిన స్థలం మొత్తం నందినగర్ గ్రౌండ్స్‌గా పిలుస్తుంటారు. ఏడాది కిందటి వరకు ఈ ఖాళీ ప్రభుత్వ స్థలంలో భారీ బహిరంగ సభలు కూడా జరిగేవి. నగరం నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సులు నందినగర్‌కు వచ్చి వేలాదిమంది ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చేవి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికి కూతవేటు దూరంలో ఉండే నందినగర్ గ్రౌండ్స్‌లో పదేండ్ల కిందట సీసీ రోడ్డు వేయడంతో పాటు రోడ్డుకు రెండు వైపులా ఖాళీ స్థలాన్ని బస్‌స్టాప్‌గా వినియోగించేవారు. అయితే ఏడాది కిందట కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. రోడ్డుకు రెండు వైపులా ఇష్టారాజ్యంగా హోటళ్లు, డబ్బాలు, ఇసుక వ్యాపారులు తిష్టవేశారు. దీంతో పాటు టీ స్టాళ్లు, కూరగాయలు, పండ్ల వ్యాపారులు ఆక్రమణలకు తెగబడ్డారు. దీనికి తోడు ప్రభుత్వ స్థలాన్ని ఎలాగైనా దక్కించుకోవాలనుకుంటున్న కొంతమంది భూ కబ్జాదారులు తాత్కాలిక షెడ్లను వేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. ఇలాంటి వారి వద్ద నుంచి కొంతమంది అధికార పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలు భారీగా అద్దెలు వసూలు చేసుకుంటూ.. ఆక్రమణలను ప్రోత్సహిస్తుండడంతో రోజురోజుకూ నందినగర్ గ్రౌండ్స్ కాస్తా ఇరుకు సందుగా మారిపోయింది. నందినగర్ గ్రౌండ్స్‌లో ప్రస్తుతం సుమారు 30 దాకా ఆక్రమణలు ఉన్నాయని, వీటితో పాటు కొన్ని తాత్కాలిక షెడ్లతో సుమారు 2000 గజాల స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నందినగర్ గ్రౌండ్స్‌లో బస్సును రివర్స్ చేసుకోవడానికి కూడా అవకాశం లేకపోవడంతో ఆరు నెలలుగా ఇక్కడకు వచ్చే 47 ఎన్, 127 ఎన్ బస్సులను ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. దీంతో తామంతా ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోందని, ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా.. తమకు ప్రయోజనం లేకుండా పోతోందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులకు నిత్యం ఫిర్యాదులు వస్తున్నా అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఆక్రమణలను తొలగించడం లేదని, ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు తెలిపారు.

### టౌన్ ప్లానింగ్ సహకారంతో తొలగిస్తాం..

**- అనితారెడ్డి, తహసీల్దార్, షేక్‌పేట మండలం**

నందినగర్ గ్రౌండ్ మొత్తం ప్రభుత్వ స్థలంగా రికార్డుల్లో ఉంది. ఇటీవల ల్యాండ్ బ్యాంక్ వివరాలను పరిశీలిస్తుండగా, ఇక్కడి స్థలం కూడా జాబితాలో ఉండడంతో పరిశీలించాం. ఆక్రమణలను తొలగించేందుకు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం, హైడ్రా అధికారుల సహకారం తీసుకుంటాం. పోలీసు బందోబస్తు తీసుకుని ఆక్రమణల తొలగింపు చేపడతాం. ప్రైవేటు వ్యక్తులు స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు.



బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని నందినగర్ గ్రౌండ్స్‌లో ఆక్రమణలు



మెట్రో రైల్‌తో ఒప్పందం చేసుకుంటున్న ర్యాపిడో ప్రతినిధులు

# గజానికి రూ. 81 వేల పరిహారం చెల్లిస్తాం

### ఓల్డ్ సిటీ మెట్రో పనులు మొదలయ్యాయి

### మెట్రో విస్తరణలో కీలక నిర్ణయం ఉంటుంది

### మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

### ర్యాపిడో-మెట్రో మధ్య కీలక ఒప్పందం

సిటీబ్యూరో, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : మెట్రో విస్తరణలో కీలక నిర్ణయం ఉంటుందని, పలు ప్రాంతాలకు విస్తరించే యోచనలో ప్రభుత్వం ధృఢ నిశ్చయంతో ఉన్నదని మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులు మొదలైనట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, హెచ్ఏఎంఎల్ అధికారులు ప్రభావిత ఆస్తుల యజమానులతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపారన్నారు. అందుకు అనుగుణంగా సేకరించే ఆస్తుల నష్టపరిహారం చదరపు గజానికి రూ. 81వేల చొప్పున చెల్లిస్తామన్నారు. శనివారం బేగంపేటలోని ఓ హోటల్‌లో ర్యాపిడో, మెట్రో రైల్‌తో ఒప్పందం చేసుకున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్వీఎస్‌రెడ్డి అనంతరం మాట్లాడారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నిర్ణయించిన పరిహారానికి అనుగుణంగా భూ యజమానులు కొందరు తమకు అంగీకార పత్రాలను అందజేశారని, వారికి 10 రోజుల్లోగా పరిహారం చెక్కు రూపంలో చెల్లిస్తామని స్పష్టం చేశారు. మిగిలిన ఆస్తుల యజమానులు కూడా వీలైనంత త్వరగా అంగీకార పత్రాలను హెచ్ఏఎంఎల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇప్పటివరకు 800 ఆస్తులకు సంబంధించిన స్పష్టత వచ్చిందని, మిగిలిన 300 ఆస్తులపై చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

### ప్రయాణికులకు మెరుగైన రవాణా..

నగరంలో మెట్రో విస్తరణపై పలు అభ్యర్థనలు వస్తున్న నేపథ్యంలో.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫేస్-2 అలైన్‌మెంట్‌పై కీలక ప్రకటన చేస్తారని ఎండీ పేర్కొన్నారు. నగరంలో వేగంగా మెట్రో విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ముఖ్యంగా నగరంలో లాస్ట్ మైల్ కనెక్టివిటీని అందించేందుకు ఎల్ అండ్ టీ, మెట్రో రైల్ హైదరాబాద్‌తో, ర్యాపిడో ఒప్పందం కుదుర్చుకున్నది.దీని ద్వారా హైదరాబాద్‌లో అర్బన్ మొబిలిటీ ఇంకా మెరుగుపడే అవకాశం ఉందన్నారు. క్లిష్టమైన మొదటి, చివరి మైలు కనెక్టివిటీ అత్యంత క్లిష్టమైందన్నారు. ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించడంలో తాము కట్టుబడి ఉన్నామన్నారు.

### ర్యాపిడో సేవలు అత్యంత కీలకం

మెట్రో ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో ర్యాపిడో సేవలు అత్యంత కీలకమని ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. 57 మెట్రో స్టేషన్ల పరిధిలో ప్రయాణించే వినియోగదారులకు కేవలం రూ. 30 నుంచి చార్జీలు మొదలవుతాయన్నారు. ప్రతినెల 2 లక్షల కంటే ఎక్కువ స్థానిక బైక్, టాక్సీ రైడర్లను ర్యాపిడో నియమించడం ద్వారా సేవలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2.7 లక్షల రోజువారీ రైడ్‌లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ మెట్రో రైల్ సీవోవో మురళీ వరదరాజన్, ర్యాపిడో చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పవన్ దీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# దర్యాప్తు ఇంకెంత కాలం?

## ఠాణాల్లో పెరిగిపోతున్న పెండింగ్ కేసులు

సిటీబ్యూరో: పోలీస్‌స్టేషన్‌లో కేసుల పెండెన్సీ పెరిగిపోతున్నది. క్రైమ్ రివ్యూలు తగ్గిపోయాయి.. క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతున్నది..వేగంగా పనులు ఎందుకు జరగడం లేదనే విషయంపై ఉన్నతస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే పరిస్థితులు కనిపించడం లేదు... ఇలా ఈ ఏడాది ట్రై పోలీస్ కమిషనరేట్లలో కేసుల పెండెన్సీ పెరిగిపోయింది. వీటన్నింటికీ తోడు కొందరు పోలీసులు స్టేషన్‌లో కంటే బందోబస్తుల పేరుతో రోడ్లపైనే ఎక్కువగా ఉండాల్సిన పరిస్థితి ఉంటున్నది. కేసుల పెండెన్సీని తగ్గించేందుకు గత నెలలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న కొందరు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను ఆయా ఠాణాలకు డీఐలుగా బాధ్యతలు అప్పగించడం గమనార్హం.. గత ఏడాది చివరిలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తరువాత అప్పటి వరకు పనిచేసిన ట్రై పోలీస్ కమిషనర్లు బదిలీ అయ్యారు. ఆ తరువాత ఎంపీ ఎన్నికల సందర్భంగా మరోసారి రాచకొండలో పోలీసు కమిషనర్ల బదిలీ, ఆ తరువాత మరోసారి బదిలీ కాగా.. అదే కోవలో హైదరాబాద్‌లో పోలీస్ కమిషనర్ మార్పు జరిగింది. ఉన్నతస్థాయిలో అధికారుల మార్పు చేర్పులతో కిందిస్థాయిలో పూర్తిగా పట్టు సడలిపోయిందనే వాదన వినిపించింది.

### ఎప్పటికప్పుడు రివ్యూలతో..

రిసెప్షన్ స్టాఫ్, స్టేషన్ రైటర్, క్రైమ్ రైటర్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ స్టాఫ్, కోర్టు మానిటరింగ్ సిస్టం, వారెంట్ స్టాఫ్, సమన్స్, టెక్నాలజీ టీమ్, ఇన్వెస్టిగేషన్ స్టాఫ్, క్రైమ్ స్టాఫ్, మెడికల్ సర్టిఫికెట్ స్టాఫ్, స్టేషన్ ఇన్‌చార్జ్, జనరల్ డ్యూటీ స్టాఫ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, అడ్మిన్ ఎస్సై ఇలా పోలీస్‌స్టేషన్లలోని ఆయా విభాగాలను 17గా విభజించి 17 వర్టికల్స్‌ను గత ప్రభుత్వ హయాంలో అందుబాటులోకి తెచ్చారు. కేసుల దర్యాప్తు వేగంగా జరుగుతూ వచ్చింది. అయితే ఈ వ్యవస్థపై కొన్నాళ్లుగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అందరిని ఒకే గాటున అధికారులు చూస్తున్నారనే వాదన నడుస్తున్నది. అలాగే కొన్ని కేసుల్లో నిందితులను అరెస్టు చేయకుండా, ఈజీగా పరారీ అనే రాసేస్తున్నారని, దీంతోనే కేసుల పెండెన్సీలు పెరుగుతున్నదనే విమర్శలొస్తున్నాయి. తాజాగా ఒక రౌడీషీటర్‌ను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతనిపై ఈ ఏడాది 9 కేసులు నమోదయ్యాయి. స్థానిక పోలీసులు ఆ విషయాన్ని పక్కన పెట్టారు. చివరకు సీసీఎస్ పోలీసులు అరెస్టు చేయాల్సి వచ్చింది.

# వెయ్యిస్తేనే.. స్మార్ట్ కార్డు

- పోస్టల్ శాఖకు బిల్లులు చెల్లించని ఆర్టీఏ
- సేవలు నిలిపివేసిన పోస్టల్ శాఖ
- ఇదే అదునుగా చెలరేగిపోతున్న ఏజెంట్లు
- డబ్బులిస్తే.. కార్డులను నేరుగా ఇప్పిస్తున్న వైనం
- కొందరి అధికారుల అండదండలతో ఏజెంట్ల వసూళ్లు
- మేడ్చల్, రంగారెడ్డిలో గుట్టలుగా పేరుకుపోయిన కార్డులు

సిటీబ్యూరో, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఆర్టీఏ కార్యాలయాల్లో స్మార్ట్ కార్డులు గుట్టలుగా పేరుకుపోయాయి. వాహనదారులకు అందాల్సిన కార్డులు రెండు, మూడు నెలలు గడుస్తున్నా అందడం లేదు. తమ కార్డు ఎప్పుడొస్తుందోనని వాహనదారులు ఎదురుచూస్తున్నారు. కానీ అధికారులు ఆ కార్డులను చిరునామాలకు చేర్చాల్సి ఉన్నా.. చేర్చకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేందని అధికారులను అడిగితే కార్డు ప్రాసెసింగ్‌లో ఉందని.. పూర్తయ్యాక ఇంటికి వస్తుందని చెబుతున్నారు. కానీ అసలు విషయం పోస్టల్ శాఖకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో పోస్టల్ శాఖ తమ సేవలను నిలిపివేసింది. 'ముందు బిల్లులు క్లియర్ చేసుకోండి.. అంతవరకు పోస్టల్ సేవలు' అందవని రవాణా శాఖకు తేల్చి చెప్పింది. ఆర్‌సీ, లైసెన్స్ తదిరత రిజిస్ట్రేషన్ కార్డులన్నీ వినియోగదారుల చిరునామాకు చేర్చేది పోస్టల్ శాఖనే. దీంతో రవాణా అధికారులు సైతం మిన్నకుండిపోయారు. ప్రభుత్వం నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఈ ప్రక్రియలో ఏజెంట్ల రాజ్యం కొలువుదీరింది. కార్డు కావాలంటే వెయ్యి నుంచి రెండు వేల వరకు వసూలు చేస్తున్నారు. కొందరి అధికారుల వీరికి అండగా ఉండటంతో వాళ్లు చెప్పిన రేటే ఫైనల్ అయిపోతున్నది.

### అడ్డదారిలో వెంటనే..

గ్రేటర్‌లో 12 రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో అధికంగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కార్యాలయాల్లో స్మార్టు కార్డులు పేరుకుపోయాయి. ఇప్పటికే 17వేల కార్డులు కార్యాలయాల్లోనే ఉన్నాయని ఓ అధికారి తెలిపారు. ఒక్క రోజుకు రిజిస్ట్రేషన్ల కోసం ఒక్క కార్యాలయానికి 80 నుంచి 200 వరకు వాహనాలు వస్తుంటాయి. కార్డులన్నీ 7-10 రోజుల్లోపు ఇంటికి చేరాల్సి ఉంటుంది. వాహనదారులు ప్రతీ రోజు కార్యాలయాల చుట్టూ తమ కార్డుల కోసం తిరుగుతున్నారు. కొందరు ఏజెంట్లను సంప్రదించి వారడిగినంత ముట్టజెప్పి కార్డులను తీసుకుంటున్నారు. రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ ప్రధాన కార్యాలయంలో ఏజెంట్లు ఆడింది ఆట పాడిందే పాటగా చెలరేగిపోతున్నారు. వారి చర్యలకు బ్రేకులు వేయాల్సిన అధికారులు సైతం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల్లో సేవలు పారదర్శకంగా అందకపోవడంతో వాహనదారులు ఇటీవల ఏజెంట్లను ఆశ్రయించడం పెరిగింది. కార్యాలయ పనివేళల్లో ఏజెంట్లు నేరుగా కార్యాలయాల్లోకి వెళ్లి ఫైళ్లు సిబ్బంది ముందు పెట్టి పనులు చేయించుకుంటున్న సంఘటనలు ఉన్నాయి.



### అధికారుల అండదండలతో..

మేడ్చల్ ప్రధాన కార్యాలయం, రంగారెడ్డిల్లోని మణికొండ, కొండాపూర్, ఇబ్రహీంపట్నం కార్యాలయాల్లో ఏజెంట్లు పేట్రేగిపోతున్నారు. ప్రత్యామ్నాయ ఆర్టీఓలుగా వ్యవహరిస్తూ వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నారు. సేవలు సకాలంలో అందాలన్నా.. కార్డులు వెంటనే పొందాలన్నా వాళ్లు నిశ్చయించిన డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రమోద్ అనే వ్యక్తి రంగారెడ్డి మణికొండ కార్యాలయంలో తన వాహనం రిజిస్ట్రేషన్ చేసుకొని రెండు నెలలకు పైగా అయింది. ఆర్‌సీ ఇంటికి చేరలేదు. అధికారులు కార్డు ప్రాసెస్‌లో ఉందని బుకాయించారు. ప్రమీల తనకు 2 నెలలు గడుస్తున్నా కార్డు అందలేదు. ఏజెంట్లను ఆశ్రయించడంతో వాళ్లడిగిన డబ్బులు ముట్టజెప్పి అదే రోజు కార్డు పొందారు. ఇక చేసేదేమిలేక వాహనదారులందరూ ఏజెంట్లను ఆశ్రయించే పరిస్థితి వచ్చింది. ఈ కార్యాలయాల్లో ఓ వైపు అధికారులు రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో ఉన్నా.. ఏజెంట్లు అదే కార్యాలయంలో మరో వైపు ప్రత్యామ్నాయ వేదికలు ఏర్పాటు చేసుకొని మరీ వాహనదారులకు సేవలందించడం విశేషం.